

కామనగరువులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు

నిండు జీవితానికి రెండు చుక్కలు

- జిల్లాలో 97.17 శాతం పోలియో వ్యాక్సినేషన్
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి దుర్గారావుదొర

అమలాపురం రూరల్, మార్చి 3: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించి వ్యాధి బారి నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం పేరూరు, అమలాపురం పట్టణ ప్రాంతాలతో పాటు చిర్రయానం, వలస కార్మిక ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేశారు. డీపీవో రాంబాబు భట్నవిల్లి, కామనగరువు పంచాయతీల పరిధిలో పల్స్‌పోలియో వ్యాక్సినేషన్‌లో పాల్గొన్నారు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, బండారులంక పీహెచ్‌సీ వైద్యాధికారి వాసునాయక్, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్, కార్యదర్శులు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, ఏఎస్‌వీఎస్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించి వారు పోలియో బారిన పడకుండా సంరక్షించుకోవాలని డీఎంహెచ్‌వో దుర్గారావుదొర కోరారు. జిల్లాలో 97.17 శాతం పల్స్‌పోలియో పూర్తయినట్టు ఆయన తెలిపారు. జిల్లాలో 1,45,318 మంది పిల్లలకు పోలియో చుక్కలు లక్ష్యంగా కాగా ఆదివారం 1,41,211 మందికి వేశామన్నారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని, తల్లిదండ్రులు సహకరించాలని డీఎంహెచ్‌వో కోరారు.



పల్స్‌పోలియో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో దుర్గారావుదొర





ఒంటిపై పెట్రోలు పోసుకుంటున్న టీడీపీ కార్యకర్త చంటి (పైన) కుర్చీలు, ప్లకార్డులకు నిప్పు పెట్టిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు (ఎడమ)

రగులుతోంది

- కోనసీమలో వేడెక్కిన రాజకీయం..!
- రామచంద్రపురంలో విధ్వంసం సృష్టించిన టీడీపీ-జనసేన కేడర్
- కుర్చీలు, ప్లకార్డులకు నిప్పు
- సుభాష్‌కి టిక్కెట్టు ఇవ్వద్దని నినాదాలు
- పెట్రోలు పోసుకుని ఓ యువకుడి హల్‌చల్
- పి.గన్నవరం టిక్కెట్టు కోసం టీడీపీ, జనసేన నేతల పైరవీలు
- అమలాపురాన్ని టీడీపీకి కేటాయించాలంటూ ఆనందరావు పట్టు
- అచ్చెన్నాయుడును కలిసిన మెట్ల రమణబాబు, అనుచరులు
- జనసేనకే కేటాయించాలని ఇన్‌చార్జి రాజబాబు ఒత్తిడి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల కాలం సమీపిస్తుండడంతో రాజకీయాలు 'రగులు'తున్నాయి. టిక్కెట్లు ఆశిస్తున్న అభ్యర్థులు, వారి అనుచరగణాలు సమావేశాలు నిర్వహించుకుంటూ ఉద్వేగపూరిత ప్రసంగాలతో ఆవేశకావేశాలకు లోనవుతున్నారు. వ్యూహ ప్రతివ్యూహాలతో సీట్ల కోసం సిగపట్లు పడుతున్నారు. టీడీపీ, జనసేనఅభ్యర్థులను ప్రకటించని మూడు స్థానాల్లోనూ ప్రస్తుతం ఈ తరహా పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం జరిగిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలోకి జనసేన కార్యకర్తలు భారీగా రావడంతో వివాదం నెలకొంది. చివరకు తారస్థాయికి చేరింది. ఓ దశలో రెచ్చిపోయిన ఇరుపార్టీల కార్యకర్తలు స్థానికేతరుడైన వాసంశెట్టి సుభాష్‌కు టిక్కెట్టు ఇస్తే సహించేది లేదంటూ అతనికి సంబంధించిన ఫ్లెక్సీలు, కుర్చీలను ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. చంటి అనే యువకుడు ఒంటిపై పెట్రోలు పోసుకునేందుకు ప్రయత్నించడంతో అక్కడే వున్న నేతలు అడ్డుకున్నారు.

పి.గన్నవరం స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ నిష్క్రమించంతో ఆ పార్టీ టిక్కెట్టు కోసం అటు టీడీపీ, ఇటు జనసేనకు చెందిన స్థానిక, స్థానికేతరులైన నేతలు మళ్లీ పైరవీలు ప్రారంభించారు. దీంతో రాజకీయం రసవత్తరంగా మారింది.

అమలాపురం అసెంబ్లీ సీటును టీడీపీకే కేటాయించాలంటూ ఆ పార్టీ నేతలు తీవ్రంగా పట్టుబడుతున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు హైదరాబాద్‌లో రఘురామకృష్ణంరాజును కలిసి టీడీపీకి కేటాయించేలా అధిష్ఠానంపై ఒత్తిడి తేవాలని కోరినట్టు తెలిసింది. మరోవైపు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు సహా ఆ పార్టీ నాయకులు అమరావతిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో సమావేశమై జిల్లా కేంద్రమైన అమలాపురాన్ని టీడీపీకే కేటాయించాలని ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జనసేనకే ఇవ్వాలంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబుతో పాటు ఆ పార్టీలోని కొందరు నాయకులు అధినేత పవన్‌కల్యాణ్‌పై ఒత్తిడి పెంచుతున్నట్టు తెలిసింది. సర్వేల నేపథ్యంలో నేతల రాజకీయ భవిష్యత్తుపై పార్టీ అధినేతల వద్ద సమాచారం ఉండడంతో నేరుగా అటు టీడీపీ అధినేత, ఇటు జనసేన అధినేతలను కలిసేందుకు కొందరు నేతలుజంకుతున్నారు. అయితే అమలాపురాన్ని జనసేనకు కేటాయించాలనే ఒత్తిడి వెనుక వైసీపీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి అనుచరుల్లో కొందరు పరోక్షంగా సహకారం అందిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. మొత్తం మీద అమలాపురం స్థానం టీడీపీదా, జనసేనదా అనేది తేల్చాసిందే కాకుండా అభ్యర్థిగా ఎవరిని నిర్ణయిస్తారనే కూడా చివరి క్షణం వరకు ఉత్కంఠగా మారే పరిస్థితులు ఇరు పార్టీల కేడర్‌లో టెన్షన్‌కు కారణమవుతున్నాయి.

టీడీపీ, జనసేన సమావేశం రసాభాస

ద్రాక్షారామ, మార్చి 3: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన కార్యకర్తల విస్తృత సమావేశం ఆదివారం సాయంత్రం ఉద్వేగం, ఉద్రిక్తతల నడుమ రసాభాసగా జరిగింది. కార్యకర్తల ఆవేశపూరిత ప్రసంగాలు, ప్లకార్డులు, కుర్చీల దహనం, టీడీపీ కార్యకర్త పెట్రోలు పోసుకోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం మండలం చోడవరం బైపాస్ రోడ్డులోని టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం నివాసం వద్ద ఆదివారం సాయంత్రం తొలుత ఆ పార్టీ నియోజకవర్గ సమావేశం ప్రారంభమైంది. ఈ సమయంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు ర్యాలీగా వచ్చారు. 'టీడీపీ టిక్కెట్ వాసంశెట్టి సుభాష్‌కు కేటాయించారని చెప్పుకుంటూ తిరుగుతున్నారు. మీ సతీమణి రెడ్డి అనంతకుమారికి ఇచ్చినట్టు సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులు పెడుతున్నారు... ఇది పొత్తు ధర్మానికి విరుద్ధం... మీకు తెలియకుండానే ఇదంతా జరుగుతోందా' అని రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రశ్నించారు. జనసేనను పిలవకుండా సమావేశం ఎందుకు పెట్టారని నిలదీశారు. వివరణ ఇవ్వడానికి సుబ్రహ్మణ్యం ప్రయత్నించగా ఆయనతో కార్యకర్తలు వాగ్వివాదానికి దిగారు. తాను వేదికపైన అన్ని విషయాలు చెప్తానని చెప్పగా అందుకు జనసైనికులు అంగీకరించలేదు. వాసంశెట్టి సుభాష్‌కు టిక్కెట్ కేటాయించిన విషయం తనకు తెలియదని, తనకు గానీ, తన భార్యకు గానీ టిక్కెట్ కేటాయించినట్టు ఇప్పటివరకు అధిష్ఠానం నుంచి సమాచారం లేదన్నారు. తన భార్య అసలు టిక్కెట్టుకే దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఎవరో పోస్టింగులు పెడితే తాను బాధ్యుడిని కాదన్నారు. వాసంశెట్టి సుభాష్ పార్టీలో చేరిన తర్వాత తనను కలవలేదని, టిక్కెట్ కేటాయించినట్టు చెప్తూ పలువురిని కలవడం తన దృష్టికి రాగా అధిష్ఠానం



రెడ్డి సుబ్రహ్మణ్యంతో వాగ్వాదానికి దిగిన జనసేన కార్యకర్తలు

దృష్టికి తీసుకు వెళ్లినట్టు వివరించారు. జనసేన, టీడీపీల్లో ఎవరు పోటీ చేస్తారనే విషయం కూడా తేల్చలేదన్నారు. దీంతో జనసైనికులు శాంతించి సమావేశంలో పాల్గొన్నారు.

రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీ ఎటువంటి నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తానని, కార్యకర్తలు గౌరవించేలా నిర్ణయం తీసుకోవాలని అధినాయకత్వాన్ని కోరారు. జనసేనకు కేటాయిస్తే గత ఎన్నికల్లో ఓటమి చెందిన జనసేన అభ్యర్థి పోలిశెట్టి చంద్రశేఖర్‌కే ఇవ్వాలని, ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. టీడీపీకి కేటాయించి తనకు టిక్కెట్ ఇస్తే అన్నిటికీ సిద్ధపడే ఉన్నానని, పోటీ చేస్తానన్నారు. లేనిపక్షంలో డాక్టర్ కాద వెంకటరమణ, మేడిశెట్టి సూర్యనారాయణ, పెంకె సాంబశివరావుల్లో ఎవరికి కేటాయించినా వారి గెలుపునకు కష్టపడతానన్నారు. కాపు సామాజికవర్గానికి చెందిన రాయపురెడ్డి సూరిబాబు (రాజా), రేవు శ్రీనుల్లో ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా నూరుశాతం కష్టపడి గెలిపించుకుంటానన్నారు.

అయితే ఈ సమావేశంలో వివాదాలు నెలకొంటాయనిముందే గ్రహించిన టీడీపీ జోన్-2 పరిశీలకుడు సుజయ్‌కృష్ణరంగారావు హాజరు కాలేదనేది చర్చనీయాంశమైంది. జనసేన, టీడీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో జనసమీకరణ జరిపి ఈనెల 9న రామచంద్రపురం మండలం హసన్‌బాదలో జరిగే చంద్రబాబు ప్రజాగళం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన కేడర్‌తో సంప్రదించే అభ్యర్థిని నిర్ణయించాలన్నారు. టీడీపీ నేత రేవు శ్రీను మాట్లాడుతూ పార్టీ ఇప్పటివరకు ఎవరికీ టిక్కెట్ కేటాయించలేదన్నారు. కార్యకర్తలు ఆందోళన చెందవద్దని, వారి అభీష్టం మేరకే నిర్ణయం తీసుకుంటుందన్నారు. అనంతరం రాయపురెడ్డి రాజా మాట్లాడారు. టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ సుభాష్ ఒక రౌడీషీటర్ అన్నారు. కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెడితే అల్లర్లు సృష్టించి దళిత మంత్రి ఇంటిని తగులబెట్టిన సుభాష్‌కు టిక్కెట్ ఎలా కేటాయిస్తారన్నారు. సుభాష్‌కు టిక్కెట్ కేటాయిస్తే దళితులంతా పోరాటం చేస్తామన్నారు. టీడీపీకి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు రాయుడు లీలాశంకర్ మాట్లాడుతూ సుభాష్ టీడీపీలో చేరాక స్థానిక నాయకులను కలవకుండా వైసీపీ నాయకులను వెంటపెట్టుకుని తిరుగుతున్నారన్నారు. సుభాష్ తల్లి అమలాపురంలో వైసీపీ కౌన్సిలరుగా కొనసాగుతున్నారన్నారు. సుభాష్‌కు టిక్కెట్ కేటాయిస్తే జనసేన, టీడీపీ ఇన్‌చార్జిలు రాజీనామా చేయాలని డిమాండు చేశారు. సుభాష్‌కు టిక్కెట్ కేటాయిస్తే తామంతా పార్టీకి రాజీనామా చేస్తామన్నారు. తెలుగు మహిళ కాజులూరు మండల శాఖ అధ్యక్షురాలు మాట్లాడుతూ ఇటీవల సుభాష్ పర్యటన జరిపినప్పుడు గ్రామ అధ్యక్షుడితో పరుషంగా మాట్లాడారన్నారు. ఇప్పుడే ఇలా మాట్లాడితే టిక్కెట్ ఇచ్చిన తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందోనన్నారు.

సమావేశం జరుగుతుండగా టీడీపీ కార్యకర్తలు సుభాష్ గోబ్యాక్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈలోపు తాళ్లపాలెం గ్రామానికి చెందిన చంటి అనే కార్యకర్త ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. కార్యకర్తలు అతడిని వారించి బయటకు తీసుకువచ్చారు. అనంతరం కార్యకర్తలు కుర్చీలు విరగ్గొట్టి సుభాష్ పేరుతో ఉన్న ప్లకార్డులను దహనం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు డాక్టర్ కాద వెంకటరమణ, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కడియాల రాఘవన్, పెంకె సాంబశివరావు, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మానవహక్కుల వేదిక ఉమ్మడి జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ

న్యాయ వ్యవస్థలో తగ్గిన విలువలు.. ప్రజాస్వామ్యానికి ప్రమాదం

మానవహక్కుల వేదిక వ్యవస్థాపక సభ్యురాలు కె.సుధ

అమలాపురం టౌన్, మార్చి 3: న్యాయ వ్యవస్థలో అంతకంతకూ తగ్గుతున్న విలువలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని మానవ హక్కుల వేదిక వ్యవస్థాపక సభ్యురాలు కె.సుధ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయ వ్యవస్థలో విలువలు పెంపొందించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అమలాపురం కిరణా మర్చంట్స్ హాలులో ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ అధ్యక్షతన హెచ్‌ఆర్‌ఎఫ్ 25 సంవత్సరాల సభ నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ, సుధ ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. 'కోర్టులు-ప్రజాస్వామ్యం' అంశంపై సుధ సుదీర్ఘంగా మాట్లాడారు. 'హక్కుల ఉద్యమ చరిత్ర-దాని ఆవశ్యకత-నేటి సమాజంలో వాటి అవసరం' అంశంపై వీఎస్ కృష్ణ మాట్లాడుతూ గతంతో పోలిస్తే సమాజంలో హక్కుల ఉల్లంఘనలు ఎక్కువైపోయాయన్నారు. ప్రతి మనిషికీ ఒకే విలువ కోసం అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు చవ్వాకుల వెంకట్, తెన్నేటి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు పవన్, అశోక్, వెంకట్, దళిత బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, పౌర హక్కుల సంఘం జిల్లా కన్వీనర్ జిల్లెల్ల మనోహర్, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.గణపతి, కె.రంగప్రసాద్, మత్స్యకార సంఘ నాయకుడు చింతా శ్రీనివాస్ మాట్లాడారు.

మూడు వారాల్లో ముగ్గురు బదిలీ

ఆలమూరుకు తహసీల్దారు 'సెట్' కావట్లేదా!

ఆలమూరు, మార్చి 3: ఆలమూరుకు తహసీల్దార్లు సెట్ కావడం లేదా అనిపిస్తోంది. ఎందుకంటే 20 రోజుల వ్యవధిలో ముగ్గురు తహసీల్దార్లు ఇక్కడి నుంచి బదిలీ కావడమే. వినడానికి ఆశ్చర్యంగా వున్నా ఇది నిజం. ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా ఆలమూరులో పని చేస్తున్న ఐపీ శెట్టి పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో కృష్ణా జిల్లా నుంచి ఎ.గోపాల కృష్ణను నియమించారు. ఏమైందో ఏమిటో తెలియదు కానీ ఆయన్ను రాజోలు బదిలీ చేశారు. ఆయన స్థానంలో రామచంద్రపురం నుంచి రాజరాజేశ్వరిని నియమించారు. ఒక్క రోజులోనే ఆమెను కపిలేశ్వరపురం బదిలీ చేశారు. తాజాగా అనిల్‌కుమార్ తహసీల్దారుగా శనివారం బాధ్యతలు స్వీకరించారు.





బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హరీష్‌మాధుర్, మాజీ ఎమ్మెల్యే బుచ్చిబాబు, జనసేన నేత డీఎంఆర్ శేఖర్ (పక్కన) వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

బాలయోగికి ఘన నివాళి

- కోనసీమ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా : హరీష్‌మాధుర్
- వైద్య శిబిరానికి భారీగా తరలివచ్చిన ప్రజలు

అమలాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ప్రదాత, లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి 22వ వర్ధంతిని కోనసీమ జిల్లావ్యాప్తంగా టీడీపీ-జనసేన శ్రేణులు ఆదివారం నిర్వహించాయి. ఎక్కడికక్కడే బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలోని బాలయోగి ఘాట్‌లో ఆయన తనయుడు, అమలాపురం లోక్‌సభ టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కోనసీమ నలుమూలల నుంచి తరలివచ్చిన టీడీపీ, జనసేన నేతలతో పాటు కార్యకర్తలు, అభిమానులు బాలయోగి ఘాట్ వద్ద నివాళులర్పించారు. తొలుత బాలయోగి తనయుడు హరీష్ తన క్యాంపు కార్యాలయంలోను, ఘాట్ వద్ద పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భారీగా తరలివచ్చిన అభిమానుల నడుమ ఘాట్‌లో పూలమాలలు వేశారు. మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చిల్లా జగదీశ్వరి, చెల్లి వివేకానంద, అమలాపురం లోక్‌సభ జనసేన ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, ఆ పార్టీ నాయకులు కంచిపల్లి అబ్బులు, యాళ్ల సతీష్, టీడీపీనేతలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నల్లా స్వామి, తిక్కిరెడ్డి నేతాజీ, బత్తుల సాయి, నాగాబత్తుల శ్రీనివాసరావు, నాగిడి నాగేశ్వరరావు, బోళ్ల వెంకటరమణ, చిల్లా పురుషోత్తం, చెల్లుబోయిన శ్రీనివాస్, సయ్యపురాజు రామకృష్ణంరాజు, మద్దాల సుబ్బారావు, సత్తిబాబురాజు, ఆశెట్టి ఆదిబాబు, వడ్డి సుభాషిణి, మాకిరెడ్డి పూర్ణిమ, పోతుల సుభాష్‌చంద్రబోస్, పరమట శ్యామ్, బోళ్ల సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌మాధుర్ మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధికి తన తండ్రి బాలయోగి చేసిన కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని తాను కూడా ఈ ప్రాంత అభివృద్ధికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో బాలయోగి ఘాట్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. తొలుత హరీష్, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చిల్లా జగదీశ్వరి శిబిరాన్ని ప్రారంభించారు. కార్డియాలజీ పరీక్షల్లో భాగంగా 2డీ ఎకో, ఈసీజీలతో పాటు కంటి పరీక్షలు, అడ్బామినల్, వివిధ రకాల పరీక్షలు చేశారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ వైద్య కళాశాలకు చెందిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన రెండు భారీ వాహనాల్లో ఏర్పాటుచేసిన డిజిటల్ ఎక్విప్‌మెంట్‌తో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 500 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు హరీష్‌మాధుర్ తెలిపారు. హాజరైన వారికి భోజన వసతితో పాటు మందులు, పండ్లు ఉచితంగా పంపిణీ చేశారు.

విశాఖలో అదృశ్యమై... జొన్నాడలో శవమై

- బక్కన్నపాలెం ఫొటోగ్రాఫర్ సాయి మృతదేహం లభ్యం
- గోదావరి ఇసుక తిన్నెల్లో వెలికితీత... వివరాలు 6లో

కెమెరాల కోసం యువకుడి హత్య

- విశాఖలో అదృశ్యమై.. జొన్నాడలో శవమయ్యాడు
- బక్కన్నపాలెం ఫొటోగ్రాఫర్ సాయి మృతదేహం లభ్యం
- గోదావరి ఇసుక తిన్నెల్లో వెలికితీత
- నిందితుడు మూలస్థానం వాసి



హత్యకు గురైన పోతిన సాయి (పాత చిత్రం)



ఆలమూరు: జొన్నాడ సమీపాన గోదావరిలో పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసిన దృశ్యం

కొమ్మాది/ఆలమూరు, మార్చి 3 : మధురవాడలోని బక్కన్నపాలెంకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం వద్ద హత్యకు గురవ్వడం స్థానికంగా సంచలనం రేపింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బక్కన్నపాలెం గ్రామానికి చెందిన పోతిన సాయి పవన్ ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా ఫొటో షూట్‌లు చేస్తుంటాడు. తండ్రి శ్రీను ఆటోడ్రైవర్ కాగా తల్లి రమణమ్మ కార్‌షెడ్ జంక్షన్‌లో ఫ్యాన్సీషాపు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా పెద్దవాడు సాయి పవన్ (22) ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఫొటోషూట్ చేస్తుంటాడు. ఈ విషయం తెలుసుకున్న కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన షణ్ముఖ తేజ తాను కూడా ఫొటో షూట్ చేస్తుంటానని, ఫోన్ ద్వారా సాయిని పరిచయం చేసుకున్నాడు. షణ్ముఖ తేజ, సాయి వద్ద రూ. 15 లక్షల విలువైన హైటెక్నాలజీ కెమెరాలు ఉన్నట్టు తెలుసుకున్నాడు.వాటిని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో సాయికి ఫోన్ చేసి రావులపాలెంలో పెద్ద ఈవెంట్ ఉందని, నీ దగ్గర ఉన్న కెమెరాలతో ఇద్దరం కలిసి ఈవెంట్ చేస్తే మంచి డబ్బులు వస్తాయని నమ్మ బలికాడు. దీంతో సాయి గతనెల 26న విశాఖ నుంచి రైలులో బయల్దేరి రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడి నుంచి షణ్ముఖ తేజ కారును అద్దెకు తీసుకొచ్చి కడియం మండలం పొట్టిలంకకు చెందిన కారు డ్రైవర్ వినోద్‌తో కలిసి దారిమధ్యలో సాయి పీకను తాడుతో బిగించి హత్య చేసి జొన్నాడ వద్ద గోదావరి ఇసుక తిన్నెల్లో పాతి పెట్టారు. రూ.15 లక్షల విలువ చేసే కెమెరాలు, ఇతర సామగ్రిని పట్టుకుని పారిపోయారు. అయితే ముందుగా తనకు ఏదో ఆపద జరుగుతుందని గమనించిన సాయి కారు నెంబరును తన తల్లికి వాట్సాప్ చేశారు. తన నెంబరు పని చేయకపోతే వేరే నెంబరుకు ఫోన్ చేయమని తేజ నెంబరు పంపించాడు. తన కుమారుడు ఆపదలో ఉన్నాడనే విషయాన్ని తల్లి తెలుసుకోలేక పోయింది. ప్రతిరోజూ మాట్లాడేవాడు రెండు రోజులుగా ఫోను చేయలేదని అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న సమాచారంతో గతనెల 29న పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్య కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాయి పంపించిన కారు నంబరు, ఫోన్ నంబరు ఆధారంగా నిందితుడు మూలస్థానానికి చెందిన షణ్ముఖ తేజగా గుర్తించారు. సాయి కుంటుబ సభ్యులు పీఎం పాలెం సీఐ రామకృష్ణ సూచన మేరకు నిందితుడి ఇంటికి వెళ్లగా అప్పటికే షణ్ముఖతేజ పరారీలో ఉన్నాడు. అతని తల్లిదండ్రుల ను పోలీసులు విచారించగా సాయిని హత్య చేసి, కెమెరాలను పైనగదిలో పెట్టినట్టు చెప్పడంతో పోలీసు లు గది తాళాలు పగలకొట్టి కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. కెమెరాలను షణ్ముఖ తండ్రిని పీఎంపాలెం స్టేషన్‌కు తీసుకెళ్లారు.



నిందితుడు షణ్ముఖ తేజ

అమ్మాయితో చాటింగ్ చేయించి పట్టుకున్నారు..

నిందితుడు షణ్ముఖ తేజ మొదటి నంబరు స్విచ్చాప్‌లో ఉండగా రెండో నెంబరును పోలీసు లు ట్రేస్ చేసి అన్నవరంలో ఉన్నట్టు గుర్తించా రు. అక్కడికి వెళ్లేసరికి ఫోన్ స్విచ్చాప్ చేసి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు శనివారం షణ్ముఖ తేజకు నగరంలోని కంచరపాలెంకు చెందిన అమ్మాయికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఉన్నట్టు గుర్తించి ఆ అమ్మాయిని, ఆమె తల్లిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఆమెతో షణ్ముఖకు ఫోన్‌లో చాటింగ్ చేయించారు. ఈమె మెసేజ్‌కు షణ్ముఖ స్పందించడంతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. విచారణ అనంతరం షణ్ముఖ ఇచ్చిన సమాచారం మేరకు సాయిని చంపి పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీ సులు గుర్తించారు. అనంతరం పవన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అయితే ఈ కేసులో కేవ లం కెమెరాల కోసమే షణ్ముఖ ఇంతకు తెగించాడా లేదా మరో కోణం ఏమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబీకుల రోదన

వారం రోజుల క్రితం అదృశ్యమైన కుమారుడు సాయి మృతదేహం చూసి తల్లిదండ్రులు శ్రీను, రమణమ్మ బోరున విలపించారు. తమతో ఎంతో సరదాగా ఉండే సాయిని దారుణంగా చంపేశారంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎల్‌హెచ్‌బీ బోగీలు



గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎల్‌హెచ్‌బీ బోగీలు

సామర్లకోట, మార్చి 3: రైలు ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అధునాతనమైన లింకె హాఫ్‌మన్ బచ్ బోగీలను కాకినాడ-లింగంపల్లి-కాకినాడల మధ్య రాకపోకలు సాగించే గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటుచేశారు. ఈ రైలు ఆదివారం నుంచి ప్రారంభించారు. కాకినాడ, సామర్లకోట రైల్వేస్టేషన్లకు ఈ మేరకు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఆదేశాలు ఆదివారం అందాయి. ఆంధ్రజ్యోతి ఆ వివరాలను సేకరించింది. ఈ అధునాతన బోగీలను ప్రాథమికంగా కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గత ఏడాది జూలై నెలలో ప్రారంభించారు. ఈ బోగీలు సత్ఫలితాలను ఇవ్వడంతో మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా ఎల్‌హెచ్‌బీ బోగీలను మార్పులు చేయడం కొనసాగించారు. అందులో భాగంగా కాకినాడ-లింగంపల్లి-కాకినాడల మధ్య రాకపోకలు సాగిస్తున్న గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలుకు కూడా ఎల్‌హెచ్‌బీ బోగీలను అనుసంధానం చేశారు. ఈఅధునాతన బోగీలను జర్మనీ కొలాబ్రేషన్‌తో కపూర్తలాలో తయారుచేస్తున్నారు. ఈఅధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీ లతో ప్రయాణం ఎటువంటి కుదుపులు, సౌండ్స్ లేకుండా సాఫీగా సాగుతుంది. డబుల్ సస్పెన్షన్, డిస్క్, బ్రేకింగ్ విధానంతోనూ ఈ బోగీలలో ప్రయాణం మరింత ఉల్లాసాన్ని ఇస్తుందని రైల్వే అధికారి తెలిపారు. మొత్తం 24 బోగీలలో 22 బోగీలు ఎల్‌హెచ్‌బీ బోగీలే కావడం విశేషం.

9, 10న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు



సదస్సు ఆహ్వానపత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 3: మూడు దశాబ్దాలుగా అమెరికాలో అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజులపాటు ఈనెల 9, 10వ తేదీల్లో అఖిల భారత తెలుగు సదస్సు జరగనుంది. కాకినాడ దంటు కళాక్షేత్రంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు సదస్సు ఆహ్వానపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. చిట్టెన్‌రాజు మాట్లాడుతూ సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు జరుపుతున్నట్లు తెలిపారు. భారత 13వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, మండలి బుద్ధప్రసాద్ అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో మార్నిజానకిరామచౌదరి, కొరుప్రోలు గౌరినాయుడు, డాక్టర్ జోస్యుల కృష్ణబాబు, వైఎస్ఎన్ మూర్తి, డాక్టర్ శైలజ, సుచిత్రామూర్తి, ప్రకాష్, చింతపల్లి సుబ్బారావు, సాయిసత్యనారాయణ, ప్రభుదాస్, కృష్ణారావు పాల్గొన్నారు.

చిన్నారిపై వేధింపులకు పాల్పడుతున్న

అధికార పార్టీకి చెందిన ఎంపీపీ కారు డ్రైవర్

- న్యాయంకోసం రోడ్డెక్కిన బాలిక కుటుంబసభ్యులు
- ఎంపీపీపై దాడికి యత్నించిన మహిళలు
- పరారీలో డ్రైవర్
- కేశవరంలో ఘటన
- పోలీసులు ఇరుపక్షాలకు నచ్చచెప్పి శాంతింప చేశారు



కేశవరంలో చిన్నారిపై ఎంపీపీ డ్రైవర్ వేధింపులను నిరసిస్తూ బాధితుడిని శిక్షించాలని కోరుతూ ఆందోళనకు దిగిన చిన్నారి బంధువులు

ఎంపీపీ వాసుపై కేశవరంలో దాడికి పాల్పడుతున్న దృశ్యం

మండపేట, మార్చి 3: నాల్గవ తరగతి చదువుతున్న చిన్నారిపై వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై ఎంపీపీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో న్యాయం కోసం రెడ్డెక్కిన బాలిక కుటుంబ సభ్యులతో కేశవరంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. న్యాయం చేస్తామని చెప్పిన ఎంపీపీ వాసు తన వద్ద పనిచేసే కారు డ్రైవర్ బాలికను వేధిస్తుండటంతో న్యాయం చేయటంలో జాప్యం చేసి డ్రైవర్‌కు వంతపాడటంతో ఆగ్రహించిన బాలిక తల్లిదండ్రులు ఆదివారం సాయంత్రం కేశవరంలో న్యాయం కోసం రోడ్డెక్కారు. గ్రామానికి చెందిన చిన్నారి స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. చిన్నారిని ఎంపీపీ డ్రైవర్ పాఠశాలకు వెళ్లే సమయంలో, వచ్చేటప్పుడు వెంటపడి వేధించటం చేసేవాడు. ఈ విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు నిఘా పెట్టారు. వెంటపడుతున్నట్టు తల్లిదండ్రులకు చెబితే చిన్నారిని హతమారుస్తానని బెదిరింపులకు పాల్పడినట్టు కూడా చిన్నారి చెప్పింది. తమ బిడ్డపై గ్రామానికి చెందిన ఎంపీపీ డ్రైవర్ కూసు ప్రసాద్ వేధింపులకు పాల్పడుతున్నాడని సీసీ పుటేజ్‌లు ఆధారంగా నిర్ధారించుకున్నారు. జరిగిన సంఘటనపై ఎంపీపీకి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఎంపీపీ కాలయాపన చేసి న్యాయం చేయకపోగా డ్రైవర్‌కి అండగా నిలవటంతో చిన్నారి తల్లిదండ్రులు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం సాయంత్రం కేశవరం - రాజమహేంద్రవరం వెళ్లే రోడ్డులో ఆందోళనకు దిగారు. ఒక దశలో బాలిక కుటుంబసభ్యులు ఎంపీపీ వాసుపై దాడికి ప్రయత్నించగా స్థానికులు అతడిని వేరేచోటకు తరలించారు. ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్తత పరిస్థితులు నడుమ కేశవరం రాజహేంద్రవరం రోడ్డులో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. కేశవరంలో జరిగిన సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పటంతో చిన్నారి తల్లిదండ్రులు ఎంపీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలవారిని చెదర గొట్టారు. ఎంపీపీని ఘటనా ప్రాంతం నుంచి సురక్షిత ప్రాంతానికి పోలీసులు తరలించారు. ఈ సంఘటనపై చోటుచేసుకున్న పరిణామాలపై పోలీసులు ఇరుపక్షాలకు నచ్చచెప్పి గొడవను సర్దుమణి గేలా చేశారు. ఎంపీపీ డ్రైవర్ జరిగిన సంఘటనపై చిన్నారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పటంతో ఆందోళన విరమించారు. మండపేట రూరల్ ఎస్ఐ చైతన్యకుమార్ తన సిబ్బందితో పరిస్థితిని అదుపు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం



శ్రీ విశ్వేశ్వర గిరి పీఠాధిపతి శ్రీ ఆత్మానంద భారతి స్వామి వారితో జ్యోతుల నెహ్రూ

జగ్గంపేటరూరల్, మార్చి 3: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జరుగుతున్న కోటి పార్థివలింగ మహారుద్రాభిషేకంలో భాగంగా ఆదివారం 7వ రోజు విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహాన్యాసము, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, అరుణ హోమం, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయులు సునీత దంపతులు పీటలపై కూర్చుని విశ్వేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ విశ్వేశ్వర గిరి పీఠాధిపతి, విశ్వ ధర్మపరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఆత్మానంద భారతి స్వామీజీ హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్మానంద భారతి స్వామీజీ మాట్లాడుతూ కోటి పార్థివ లింగా మహా రుద్రాభిషేకం జ్యోతుల నెహ్రూ పూర్వజన్మ సుకృతం వల్లే ఇంతటి కార్యక్రమాన్ని చేస్తున్నార న్నారు. ప్రతిఒక్కరు శివనామ స్మరణ, విష్ణు నామస్మరణ తో సనాతన ధర్మాన్ని పాటించాలని స్వామిజీ కోరారు.

నా బాల్యం గుర్తొచ్చింది..

- షిర్డీసాయి క్రీడోత్సవ్‌లో నటుడు సాయికుమార్



క్రీడోత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు సాయికుమార్, భారతషూటర్ ఈషాసింగ్, నౌకాదళ కమేండర్ స్వాతి

రాజమహేంద్రవరం రూరల్/దివాన్‌చెరువు, మార్చి 3: రాజమహేంద్రవరం షిర్డిసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రీడోత్సవ్ పేరుతో నిర్వహించిన వార్షిక క్రీడా, సాంస్కృతిక కార్యక్రమం దివాన్‌చెరువు షిర్డిసాయి విద్యాప్రాంగణంలో ఘనంగా జరిగింది. దీనికి భారత షూటర్ ఈషాసింగ్, నౌకాదళ లెఫ్టినెంట్ కమాండర్ పి.స్వాతి, నటుడు సాయికుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. షిర్డిసాయి విద్యానికేతన్ వ్యవస్థాపకుడు తంబాబత్తుల పాలేశ్వరరావు సతీమణి నాగమణి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈషాసింగ్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలంటే కృషి, పట్టుదల అవసరమన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ మార్చ్‌ఫాస్ట్ డ్రిల్ చూస్తున్నపుడు తన బాల్యం గుర్తుకు వచ్చిందని, తాను కూడా ఎన్‌సీసీ విద్యార్థినే అన్నారు. స్వాతి మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపాత్ర కీలకమన్నారు. తన స్వీయ అనుభవాలను వివరించారు. విద్యార్థుల ప్రదర్శనలు, సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య, టి.శ్రీలేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా మాఘమాస తిరునాళ్లు

- ఆలయానికి పోటెత్తిన వేలాది భక్తులు



విశేషాలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి

సర్పవరం జంక్షన్, మార్చి 3: దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాల్లో ఒకటిగా ఖ్యాతి గడించిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో మాఘమాస మహోత్సవాలు గత నాలుగు ఆదివారాలుగా అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శ్రీభావనారాయణస్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాక రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముందుగా స్వామివారికి పూజారులు సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామిని దర్శించుకునేందుకు అనుమతించారు. భావనారాయణస్వామిని దర్శించుకున్న అనంతరం ఈశాన్యభాగాన ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయం లోని ఆదిశేషు శ్రీభావనారాయణస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రీతిపాత్రమైన పాల పొంగులను ఆవుపిడకల పొయ్యిపై పరమాణ్ణం తయారుచేసి భక్తశ్రద్ధలతో స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. మాఘమాసంలో భావనారాయణస్వామిని దర్శించుకుంటే దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాల్లో ఉన్న శైవక్షేత్రాలను దర్శించుకున్న ఫలితం దక్కుతుందని భక్తులు తెలిపారు. సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జె భీమశంకరరావు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్, ఉప సర్పంచ్‌లు శీలం నాగేశ్వరరావు, పుల ప్రభాకరరావు, పుల్లచందూ, పుల్ల చక్రధర్, పి.వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతులు 80 శాతం పూర్తి



పనులు నిర్వహిస్తున్న కార్మికులు

మోతుగూడెం, ఫిబ్రవరి 3: చింతూరు మండలం మోతుగూ డెం డొంకరాయి మరమ్మతులు 80శాతం పూర్తయ్యాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ పవర్ కెనాల్ రెండు రీచ్‌ల్లో కూడా పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. మరో ఒక రోజులో మిగతా 20 శాతం పనులు కూడా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గ్రిడ్ అధికారులు ఈనెల 5వ తేదీ వరకే ఎల్‌సీ అనుమతులు మంజూరు చేశారని, అయితే ఈనెల 4వ తేదీన పూర్తి చేయించాలని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ ఆదేశించడంతో కాంప్లెక్స్ పరిధిలోని ఇంజనీర్స్ సిబ్బంది దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తూ పనుల్లో నాణ్యత లోపాలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. గత రెండు రోజులు నుంచి ప్లాస్టింగ్ కాంక్రీట్ పనులు సుమారు 20 మంది కాంట్రాక్టర్లు 400 మంది కార్మికులు చేస్తున్నారు. ఆదివారం కానీ, సోమవారం కానీ ఉభయగోదావరిజిల్లాల రబీ సీజన్ నీళ్లు వదులుతున్న నేపథ్యంలో ఏపీ జెన్కో అధికారులు పనులు వేగంగా చేస్తున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరం బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాములవారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వరరామచంద్రపురం, మార్చి 3: రెండో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరిలో సీతారాములవారి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. భద్రాచలం దేవాలయం వారి ఆధ్వర్యంలో హిందూ ప్రచారంలో భాగంగా శ్రీరామగిరిలో రామాలయ ప్రచార వాహనంలో ఈ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి స్థానిక శ్రీరామగిరి ప్రధానార్చకుడు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు, ఈవో గన్ని లక్ష్మికుమారి, మేనేజర్ సాయిబాబు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి తీర్థం



ముమ్మిడివరం, మార్చి 3: ప్రజల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవం ఆదివారం వైభవం గా సాగింది. గత నెల 23న ప్రారంభమైన అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నాటి తీర్థంతో ముగిశాయి. తొమ్మిది రోజులపాటు జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. కోనసీమజిల్లా నుంచే కాకుండా ఉభయగోదావరి జిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను తిలకించి తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. మేకల వంశీయులు అమ్మవారికి స్వయంపాకం సమర్పించి జాతర మహోత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని ఆలయ ప్రాంగణం నుంచి డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళాలు, బాజాభజంత్రీలు, గగుర్పాటుకు గురిచేసే శక్తివేషాలు, నాగిని డ్యాన్సులు, కేరళ వాయిద్యాలు, తీన్‌మార్ వాయిద్యాలు, కోయ నృత్యాలు, బుట్టబొమ్మల వేషధారణలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో మిరుమిట్లు గొలిపే బాణాసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగే తీర్థ మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 30వేల మంది భక్తులకు అన్నసమారాధనలో అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. సత్యసాయి సేవాసమితి సభ్యులు 150 మంది అన్నసమారాధనలో పాల్గొని సేవలు అందించారు. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య ఆధ్వర్యంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం ఎస్ఐలు డి.సురేష్‌బాబు, నాగేశ్వరరావు, భానుప్రసాద్‌లతో వంద మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు.



సత్తెమ్మతల్లిని దర్శించుకుందుకు తరలి వస్తున్న భక్తులు



ఆకర్షిస్తున్న శక్తివేషాలు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది, మార్చి 3: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి నిత్యాన్నదానానికి టేకిశెట్టిపాలేనికి చెందిన కటికిరెడ్డి సుబ్బారాయుడు, రాజేశ్వరి దంపతులు రూ.1,00,116, తాటిపాకకు చెందిన లక్కింశెట్టి వెంకటేశ్వరరావు రూ.50,116 విరాళంగా అందించారు. దాతలకు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయసారధి, సిబ్బంది విజయ్, పోతురాజు శ్రీవెంకట కృష్ణ, విష్ణుభట్ల సుందరరావు పాల్గొన్నారు.

- మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు
- లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగి వర్ధంతి
- ఘన నివాళులర్పించిన టీడీపీ నాయకులు

కోనసీమ అభివృద్ధి ప్రదాత బాలయోగి





ముమ్మిడివరం: బాలయోగికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, రాజోలు: బాలయోగికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ముమ్మిడివరం, మార్చి 3: దివంగత లోక్‌సభ స్పీకర్ బాలయోగి వర్ధంతిని ముమ్మిడివరంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువుగట్టున ఉన్న బాలయోగి విగ్రహానికి అనాతవరం జీఎంసీ బాలయోగి కాలనీలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధి ప్రదాత బాలయోగి అన్నారు. ఆయన చిరకాల వాంఛ కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ అని, ఆయన కుమారుడు హరీష్ మాధుర్‌ను పార్లమెంటుకు పంపించడం ద్వారా బాలయోగి కోరికను నెరవేర్చగలుగుతామన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, దొమ్మేటి రమణకుమార్, నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, దాట్ల పృథ్వీరాజ్, చిక్కాల అంజిబాబు, నడింపల్లి సుబ్బరాజు, గొల్లపల్లి గోపి, తాడి జానకీరామ్, దాట్ల బాబు, మిమ్మితి చిరంజీవి, యాళ్ల ఉదయ్, కురసాల శివబాబు, వాసంశెట్టి అమ్మాజీ, కుడుపూడి మల్లేశ్వరి, సత్తి నూకరాజు, మట్ట సత్తిబాబు పాల్గొన్నారు.

అయినవిల్లి: ఆదివారం కె.జగన్నాథపురంలోని శ్రీఉమామహేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో గల బాలయోగి శిలా విగ్రహానికి నివాళులర్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ అక్కిశెట్టి దుర్గారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోనసీమ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆయన కుమారుడు హరీష్‌మాధుర్‌ను పార్లమెంటుకు పంపించేందుకు అమలాపురం పార్లమెంటు ప్రజలు సహకరించాలని బాలయోగి చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగుమళ్ల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు, నల్లా సత్తిబాబు, సూదా వెంకన్న, లంక కిష్టయ్య, టీడీపీ నాయకులు శీలం వెంకన్నబాబు, మట్టపర్తి లోకేశ్, కోట గౌరీశంకర్, తాడినాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: బాలయోగి వర్ధంతిని పాశర్లపూడి-అప్పనపల్లి గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు ఆదివారం నిర్వహించారు. ఆయా చోట్ల బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, సర్పంచ్ సుందరనీడి చిన్ని, నాయకులు బోనం బాబు, సూదా బాబ్జి, మద్దాల కృష్ణమూర్తి, ఉండ్రు శ్రీరామారావు, వాసంశెట్టి వెంకట్రావు, దొంగ సత్తిబాబు, గంధం భాస్కర్, కడలి నూకరాజు, మెండా వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోనగేట్ సెంటర్‌లో బాలయోగి విగ్రహానికి తెలుగుదేశం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, జొన్నాడ రాజారావు, విత్తనాల వెంకటరమణ, కముజు లక్ష్మీరమణారావు, విత్తనాల బుజ్జి, చెల్లి అశోక్, నంద్యాల వెంకటేశ్వరరావు, వాసంశెట్టి రాజేశ్వరరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, సత్తాల ప్రసాద్, కోటిపల్లి సత్యనారాయణ, గుబ్బల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: పాత ఇంజరంలో బాలయోగి విగ్రహానికి టీడీపీ-జనసేన ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద పూలమాలలువేసి నివాళులర్పించారు. ముదునూరి రామలింగరాజు ఆర్థిక సహకారంతో టీడీపీ విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు జంపన రామభద్రరాజు ఆధ్వర్యంలో బుచ్చిబాబు చేతుల మీదుగా ఐదుగురు విభిన్న ప్రతిభావంతులకు వీల్‌ఛైర్స్ అందించారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, నడిం పల్లి సుబ్బరాజు, సాగిరాజు సూరిబాబురాజు, బీర సత్యకుమారి, సాకా సీతాదేవి, దాసరి జగదీశ్వరి, వనచర్ల వెంకటేశ్వరరావు, పేరాబత్తుల వెంకటరమణ, సాగి వాసురాజు, వీధి లోవరాజు, జనిపెల్ల గిరి, సంగాని వీరబాబు, బొంతు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: దిండిలో బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బందెల పద్మ, ముదునూరి శ్రీనివాసరాజు, కె.బాలరాజు, వెంకటరమణ, వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం రాజోలులో కాటన్ పార్కు వద్ద జీఎంసీ బాలయోగి వర్ధంతిని నిర్వహించారు. బాలయోగి విగ్రహానికి టీడీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, ఎంపీపీ కేతా శ్రీను పూలమాలలువేసి నివాళులర్పించారు. చాగంటి స్వామి, పొలమూరి శ్యామ్‌బాబు, పామర్తి రమణ, గేదెల వరలక్ష్మి, మోకా పార్వతి, అడబాల చంటి, గాలిదేవర వెంకన్నబాబు, మోకా ప్రసాద్, సర్పంచ్ కడలి సత్యనారాయణ, కడలి వెంకటరమణ, గుబ్బల కుమార్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, కాండ్రేగుల సత్యనారాయణ, మానుకొండ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో బాలయోగి విగ్రహానికి టీడీపీ, జనసేన నేతలు నివాళులర్పించారు. టీడీపీమండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, సర్పంచ్ చిక్కం జంగమయ్య టీడీపీ నాయకులు పోలిశెట్టి భాస్కరరావు, గొలకోటి చిన్నా, బూసి బుజ్జిదొర, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, సలాది శ్రీనివాసరావు, చిక్కం ఉమేష్, పెమ్మిరెడ్డి సురేష్, జిన్నూరి శ్రీను, మధుర ప్రతాప్, చీకట్ల ఏసు, చిక్కం కాసు, నిమ్మకాయల సూర్యప్రకాష్, వీరా వెంకటేశ్వరరావు, కడలి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు చిక్కం సూర్యమోహన్ పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంవద్ద బాలయోగి విగ్రహానికి టీడీపీ, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాసరి వీరవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరావు, గణపతి వీరరాఘవులు, గుడాల ఫణి, అరిగెల సూరిబాబు, దొమ్మేటి సాయికృష్ణ, మందా రాజేష్, చిన్నం బాలవిజయరావు, కొర్లపాటి డిల్లీ, యడ్లపల్లి తుక్కియ్య, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

యానాం: స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో ఉన్న బాలయోగి విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, సీఐ షణ్ముగం తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యానా సమాచార శాఖాధికారి కె.ఎల్.వి.ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: కోనసీమ అభివృద్ధికి జీఎంసీ బాలయోగి చేసిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. స్థానిక అక్విడెక్టు వద్ద గల బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండాడ నాగమణి, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తిబాబు, ఆరుమిల్లి లాల్‌బాబు, అంబటి కోటేశ్వరరావు, శేరు శ్రీనుబాబు, ఎం.కిరణ్ కుమార్, కె.సత్యనారాయణరాజు, యల్లమిల్లి చిట్టిబాబు, లంకే చిరంజీవి, మేడిద పద్మానాభం, చీకట్ల రామకృష్ణ, దొమ్మేటి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కొత్తపేట పాతబస్టాండ్ సమీపంలో ఉన్న బాలయోగి విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన చేసిన అభివృద్ధిని కొనియాడారు. టీడీపీ నాయకులు బూసి జయలక్ష్మిభాస్కరరావు, ముత్యాల బాబ్జి, యల్లమల్లి జగన్మోహన్, బీర ఇసాక్, మిద్దే ఆదినారాయణ, బూసి విష్ణుమూర్తి, బండారు వీరన్న కాపు, పెనుమల్ల అన్నవరం, బయ్యే రాంబాబు, కముజు వెంకటేశ్వరరావు, బండారు వీరబాబు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతిని పురస్కరించుకుని మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్‌ల ఆధ్వర్యంలో బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ బడుగు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు చింతపట్ల గంగాసత్యనారాయణ, బండి సుబ్బారావు, కొల్లి అంబేడ్కర్, బళ్ల వెంకటేశ్వరరావు, బొంతు శ్రీనివాస్, వాసా భీమశంకరం, కాశిన బాబి, కొండా రాజు, మాడా దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు



చెల్లూరులో ఎమ్మెల్యే వేగుళ్లకు తిలకం దిద్దుతున్న మహిళ

రాయవరం, మార్చి 3: సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం చెల్లూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. జనసేన, టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రావణ కాష్టంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు.జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం తిరిగి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. నిరంకుశ పాలనకు ఓటు అనే ఆయుధంతో చరమగీతం పాడాలని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖఅధ్యక్షుడు చుండ్రు వీర్రాజు చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, మాజీ సర్పంచ్‌లు నూనె ఏసుబాబు, మోరంపూడి రాజ్‌కుమార్, టీడీపీ, జనసేన నేతలు కాదా శ్రీను, దార్ల సుధీర్‌బాబు, చికట్ల నారాయణరావు, సుంకర వీరాబాబు, పట్టెం శివ, కొండేపూడి ఆనంద్, ఎ.నరేష్, సుంకర సంతోష్, మత్స్యకార సంఘనేతలు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి



ఈతకోటలో టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండారు సత్యానందరావు

రావులపాలెం, మార్చి 3: టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో పయనిస్తాదని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. ఈతకోటలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి సత్యానందరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషిచేయాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

కొత్తపేట, మార్చి3: నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం పలివెల గ్రామంలో చప్పిడివారిపాలెం, రజకులపేట, చినపేట, అరందలిపేటలో బాబుష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ తనను గెలిపించాలని కోరారు. పెద్దఎత్తున మహిళలు పూలమాలలతో స్వాగతిస్తూ హారతులు పట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత మహిళలు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై భారీ ఊరేగింపు

ఆలమూరు, మార్చి 3: చింతలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం అధ్యయనోత్సవం, చూర్ణోత్సవం, మాఘ మాసవ్రతంతో పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రముఖుల ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. అనంతరం వేంకటేశ్వరస్వామిని హనుమద్ వాహనంపై పుర వీధుల్లో మేళతాళాలతో భక్తుల గోవిందనామస్మరణ నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు బ్రహ్మోత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు అన్నసమారాధన నిర్వహించారు.

పల్స్‌పోలియో విజయవంతం



అంతర్వేది: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ

ముమ్మిడివరం, మార్చి 3: కొత్తలంకలో పీహెచ్‌సీ పరిధిలో 12బూత్‌ల ద్వారా ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు సీహెచ్ ముకుంద, డి.పూజల ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. 2,412మందిలో 2378మందికి పోలియో చుక్కలువేసి 92.32శాతం లక్ష్యాన్ని సాధించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో 2మొబైల్ టీమ్స్‌గా సీహెచ్‌వో కృపాబాయి, హెల్త్ అసిస్టెంట్ నార్ని శ్రీనివాస్, ముగ్గురు రూట్ సూపర్‌వైజర్లతో ఐ.విమలకుమారి, పీహెచ్‌ఎన్ ఎం.శాంతకుమారి, హెచ్‌వీ జి.శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఎస్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మామిడికుదురు: పోలియో రహిత సమాజానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు కేజే ప్రశాంత్, కె.స్వర్ణలత, స్పందన పాల్గొన్నారు.

కె.గంగవరం: కుందూరులో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఆసుపత్రి పరిధిలో 1749మంది పిల్లలకు పోలియోచుక్కలు వేయాల్సి ఉండగా 1702మందికి వేశారు. 98శాతం నమోదైంది. పేకేరుఆసుపత్రి పరిధిలో డాక్టర్ ఎం.శ్రీలక్ష్మి, డాక్టర్ రేఖారాణి పర్యవేక్షణలో 1428మందిలో 1366మందికి చుక్కలు వేశారు.

అంబాజీపేట: పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల పరిధిలో 31పోలియో కేంద్రాల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యాధికారులు డాక్టర్ వి.గౌతమి, శ్రీనివాస్, ఇంద్రావతి పోలియో కేంద్రాలను పరిశీలించారు.

కాట్రేనికోన: కాట్రేనికోన పీహెచ్‌సీ పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర పరిశీలించారు. తీరప్రాంత గ్రామాలైన జీకే పోర, చిర్రయానాంలలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. వైద్యాధికారిణి లిఖిత పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాక పీహెచ్‌సీ సెంటర్‌లో చిన్నారులకు ఎంపీపీ కేతా శ్రీను పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషిచేయాలన్నారు.

అల్లవరం: గోడిలంకపీహెచ్‌సీ వద్ద చిన్నారులకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు పోలియో చుక్కలు వేశారు. మండలంలోని 33కేంద్రాల్లో పల్స్‌పోలియో విజయవంతంగా జరిగిందని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ తెలిపారు. వైస్ ఎంపీపీ వడ్డి గంగ, డాక్టర్ వై.బాలసుబ్రహ్మణ్యం, ఎస్.సుమ, సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, సాధనాల వెంకట్రావు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ పరిధిలో 98శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి తెలిపారు. 1,294మందికి లక్ష్యం కాగా 1,269మందికి పోలియో చుక్కలు వేశారు.

మండపేట: మండపేటలో 32 కేంద్రాలు, రెండు మొబైల్ టీమ్స్ ద్వారా వైద్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 4,948మందికి 4,721మంది చిన్నారులకు పోలియె చుక్కలు వేసినట్టు వైద్యులు తెలిపారు.

యానాం: యానాం ఆసుపత్రి డీడీ డాక్టర్ టీ.రవిశంకర్ ఆధ్వర్యంలో పరిపాలనాధికారి మునిస్వామి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాలు, ఆలయాలు, ప్రధానకూడల్లో పిల్లలకు పోలియోచుక్కలు వేశారు.

పి.గన్నవరం: పి.గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో జడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అడ్డగళ్ల వెంకటసాయిరాం, పితాని నరసింహరావు, కొక్కిరి రవికుమార్, దొమ్మేటి సూర్య, ఏడుకొండలు పాల్గొన్నారు.

రామచంద్రపురం: పట్టణంలో వైద్యాధికారులు డాక్టర్ సి.ఎస్.బి.కృష్ణహరీష్, డాక్టర్ డి.హేమసుధీర్ ఆధ్వర్యంలో 31 కేంద్రాల్లో 4,909మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్స్ అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, అగ్రహారానికి చెందిన రాజారత్న కళాశాల నర్సింగ్ విద్యార్థులు సేవలందించారు.

ఐ.పోలవరం: కేశనకుర్రు పీహెచ్‌సీ పరిధిలో 10 సచివాలయాల్లో 20బూత్‌ల ద్వారా పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. 98శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారిణి శివగాయత్రి తెలిపారు. మురమళ్ల పోలియో బూత్‌ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సత్యనారాయణ పరిశీలించారు.

ఆత్రేయపురం: పేరవరంలో ఎంపీపీ కుండా అన్నపూర్ణ, ర్యాలిలో జడ్పీటీసీ బోణం సాయిబాబా చిన్నారులకు పోలియో చుక్కలువేశారు. మండలంలో 97శాతం పల్స్‌పోలియో నమోదైనట్టు డాక్టర్లు సౌమ్య, హేమశ్రీ తెలిపారు.

రాయవరం: మండలంలోని 12 గ్రామాల్లో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారులు ఎం.శ్రీనివాస్, కె.మణికంఠ, అనిరుధ్, రమ్య ఆధ్వర్యంలో 4,985మంది చిన్నారులకు పోలియోచుక్కలు వేయాల్సి ఉండగా 4,841 మందికి చుక్కలు వేశారు. రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, పసలపూడి జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఆయాగ్రామాల సర్పంచ్‌లు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం ప్రతీ గ్రామంలో సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. సఖినేటిపల్లి పీహెచ్‌సీలో ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబులు ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలువేశారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారం పోలియో చుక్కలు వేస్తారన్నారు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



కొత్తపేట, మార్చి 3: మోడేకుర్రు గ్రామ శివారు కడలివారిపాలెంకు చెందిన వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరిని కొత్తపేట అసెంబ్లీ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఉమ్మడి అభ్యర్థిగా ఉన్న తన విజయానికి కృషిచేయాలని, ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి

మలికిపురం, మార్చి 3: పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు ఈరాష్ట్రం కోసం పడుతున్న శ్రమలో మనమంతా భాగస్వాములు కావాలని జనసేన ఆత్మీయ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. జనసేన, టీడీపీ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు అధ్యక్షతన జనసేన నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ జనసేన, టీడీపీ కూటమి విజయానికి ముందుకు వెళ్తూ ప్రతీ గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్, బొంతు రాజేశ్వరరావు, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, పి.ప్రభ, గుబ్బల ఫణికుమార్, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీను, ఉండపల్లి అంజి, రావూరి నాగరాజు, తాతాజీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హర్ష విజ్ఞాన భారతి వార్షికోత్సవం

అల్లవరం, మార్చి 3: కొమరగిరిపట్నం హర్ష విజ్ఞాన భారతి స్కూలు 40వవార్షికోత్సవం జరిగింది. విద్యార్థుల్లో మానసికోల్లాసానికి క్రీడలు, యోగాసనాలు దోహదపడతాయని డైరెక్టర్ ఎం.పట్టాభిరామారావు అన్నారు. కేపీవీ కృష్ణమాచార్యులు, డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావు, అల్లూరి వెంకటేశ్వరరావు, ప్రధానాచార్య ఎ.నాగేశ్వరరావు, విద్యార్థులు, తల్లిదండ్రులుపాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: చారీ 111
వెంకటరమణ	: ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	: భూతద్దం భాస్కర నారాయణ
శేఖర్ స్క్రీన్-1	: ఊరిపేరు భైరవకోన
శేఖర్ స్క్రీన్-2	: హనుమాన్
రమా	: గుంటూరు కారం
గణపతి	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటపద్మావతిస్క్రీన్-1	:ఆపరేషన్ వాలంటైన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: డూన్

సత్యవాడ శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కె.గంగవరం, మార్చి 3: సత్యవాడ సోమేశ్వరస్వామి ఆలయంలో పునః శివలింగ ధ్వజ చండేశ్వరస్వామి వార్ల ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ సలాది సూర్యకళావతి శ్రీను, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

పవన్ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తాం

ఆత్రేయపురం, మార్చి 3: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాలను శిరసావహిస్తూ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి పాటుపడతామని ఆ పార్టీ కొత్తపేట నియోజకవర్గ నేతలు పేర్కొన్నారు. ఆదివారం ఆత్రేయపురంలో జనసేన మండల శాఖ అధ్యక్షుడు చేకూరి కృష్ణంరాజు స్వగృహంలో నాలుగు మండలాల నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు, ఎన్నికల నిర్వహణ కార్యదర్శి సలాది జయప్రకాష్, మండల శాఖల అధ్యక్షులు కంఠంశెట్టి చంటి, తోట స్వామి, సూరపురెడ్డి సత్య, పి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

7న 'హలో మాదిగ... చలో రావులపాలెం'

ఆలమూరు, మార్చి 3: రావులపాలెంలో ఈనెల7న నిర్వహించే 'హలో మాదిగ-చలో రావులపాలెం' సభను విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజీవ్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన గుమ్మిలేరులో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. నాయకులు బజ్జింగి సుధాకర్, తాతపూడి మూర్తి, బుంగ సునీల్‌దత్తు, బుంగ అబ్రహం, కుడేల్ల రాజు, తాతపూడి సత్య, తాతపూడి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలి

రాజోలు, మార్చి 3: వివేకానందరెడ్డి హత్య కేసులో సీఎం జగన్మోహన్‌రెడ్డి పాత్రపై సీబీఐ సమగ్ర విచారణ వెంటనే జరపాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బోళ్ల వెంకటరమణ డిమాండు చేశారు. రాజోలులో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం వైఎస్ వివేకానందరెడ్డిని జగన్ మురానే హతమార్చిందని ఆరోపించారు. కర్నూలులో అవినాష్‌ని అరెస్టు చేయడానికి సీబీఐ వస్తే ఉద్రిక్త వాతావరణం సృష్టించింది వైసీపీ నేతలు కాదా అని ప్రశ్నించారు. వైఎస్ సునీతారెడ్డి అడుగుతున్న ప్రశ్నలకు జగన్ అండ్ కో సమాధానం చెప్పాలని వారు డిమాండు చేశారు.

కాపు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

అమలాపురం టౌన్, మార్చి 3: కాపు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దక్షిణ భారతదేశ టీటీకే జేఏసీ కన్వీనర్ దాసరి రాము పేర్కొన్నారు. కాపు ఉద్యోగ సేవాసమితి జిల్లాశాఖ సమావేశం ఆదివారం అమలాపురంలో నల్లా రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. రాముతో పాటు రాష్ట్ర కాపు ఉద్యోగ జేఏసీ నాయకులు సోమరౌతు రామకృష్ణ, లక్ష్మీపతి, నాయుడు రమేష్, సత్యనారాయణలు హాజరయ్యారు. వివిధ రంగాల్లో కాపు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాము చర్చించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతులమీదుగా ఉమ్మడి రాష్ట్రాల స్థాయిలో ఎక్సలెన్స్ సర్వీస్ ఇన్ ఇంజనీరింగ్ ఫీల్డు అవార్డు అందుకున్న పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబును సత్కరించారు. ప్రధాన కార్యదర్శి దంగుడుబియ్యం శ్రీనివాసరావు, పైడిపర్తి చిన్ని, సంధ్యాల నాయుడు, నాగిరెడ్డి శివప్రసాద్, పిండి శివసాయిప్రసాద్, కొమ్ముల రాఘవరావు, తోలేటి దొరబాబు, వలవల రాజా, వేమన సత్యనారాయణ, నల్లా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాలస్వామి దరఖాస్తు

అమలాపురంటౌన్, మార్చి3: బీజేపీ అమలాపురం పార్లమెంటు అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు ఈతకోట బాలస్వామి దరఖాస్తు చేస్తుకున్నారు. ఇటీవల త్రిసభ్య కమిటీకి దరఖాస్తును అందజేయగా ఢిల్లీలో కేంద్ర పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు.

చైర్‌పర్సన్ పూజలు

మండపేట, మార్చి3: స్థానిక గొల్లపుంతలో వేంచేసి ఉన్న శ్రీవారాల సత్తెమ్మతల్లిని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వైసీపీ యువ నేత తోట పృధ్వీరాజ్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ స్వాగతం పలికింది.

శెట్టిబలిజ కుల ధ్రువపత్రాల మంజూరులో సమస్యలు పరిష్కరించాలి

మామిడికుదురు, మార్చి 3: శెట్టిబలిజ కుల ధ్రువపత్రాల మంజూరులో ఏర్పడిన సమస్యను పరిష్కరించాలంటూ టీడీపీ నాయకులు ఆదివారం పాశర్లపూడిలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీను మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో కుల ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే కంప్యూటర్ డ్రాప్ బాక్సులో 50బీసీ కులాల పేర్లు ఉన్నప్పటికీ శెట్టిబలిజ కులం లేకుండా పోయిందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు ధ్రువపత్రాలు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలంటూ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోనం బాబు, కోలా రాంబాబు, చొల్లంగి రామకృష్ణ, గంధం భాస్కర్, చుట్టుగుళ్ల కిశోర్, పితాని వెంకటేశ్వరరావు, ఉండ్రు శ్రీరామారావు, వాసంశెట్టి వెంకట్రావు, కొల్లు ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

అంబాజీపేట, మార్చి 3: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం అంబాజీపేట మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా కాసు శ్రీను, కార్యదర్శిగా గోకవరపు శివ, కోశాధికారిగా బొండాడ శివ, సభ్యులను ఎన్నుకున్నారు. రెండేళ్ల ఈకార్యవర్గం కొనసాగుతుంది. కార్యక్రమంలో సంఘ నాయకులు వెదుళ్లపల్లి కుమార్, అప్పన వాసు, కాసు సాయిబుజ్జి పాల్గొన్నారు.

సూర్యప్రకాశరావు సేవలు అభినందనీయం

అంబాజీపేట, మార్చి 3: ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన నల్లి సూర్యప్రకాశరావు సేవలు అభినందనీయమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పీపీఎస్ రామారావు పేర్కొన్నారు. అంబాజీపేటలో ఉద్యోగ విరమణ చేయడంతో ఎస్టీయూ ఆధ్వర్యంలో సూర్యప్రకాశరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎన్.శివప్రసాద్, నాయకులు బోనం గంగాధర్, సీహెచ్‌వీ సతీష్, ఎండీఎస్ఎం షరీఫ్, జగదీష్, పి.మూర్తి, సత్యనాథ్ పాల్గొన్నారు.

నామన రాంబాబుకు పరామర్శ

మామిడికుదురు, మార్చి 3: సతీ వియోగంతో బాధపడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబును టీఎస్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నబ్బుతి ఫణీశ్వరరావు ఆదివారం పరామర్శించారు. రాంబాబు సతీమణి కృష్ణవేణి చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఉప్పలగుప్తం, మార్చి 3: రవి ఈఎన్టీ, ఎండోస్కోపీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం గొల్లవిల్లి భీమేశ్వరా ఆడిటోరియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముక్కు, గొంతు, చెవి వ్యాధులకు డాక్టర్ కాశిన రవికుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాశిన కుమారస్వామి, మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ, సూదా లక్ష్మీనారాయణ, బడుగు గణేష్ తదితరులు సేవలందించారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్

రాజోలు, మార్చి3: రాజోలు మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్‌ఫెయిర్ ఆకట్టుకుంది. దీనిని ఎంఈవో ఎన్.మనోహరం ప్రారంభించారు. ఒకటి నుంచి ఆరోతరగతి విద్యార్థులు చేసిన వంద ప్రాజెక్టులను పరిశీలించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలరాణి సైన్స్‌ఫెయిర్‌ను వీక్షించారు. ఎంఈవో2 టీఎస్‌కేడీ ప్రసాదరావు, పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, రిటైర్డ్ ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, వాడ్రేవు పాపయ్య పంతులు, జగడం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

మామిడికుదురు, మార్చి 3: ప్రభుత్వం ఇంటింటికీ తాగునీరు అందిస్తుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. గెద్దాడలో 36.9లక్షలతో ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైను పనులకు ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజాకుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రేణారమణి, సర్పంచ్ గుబ్బల గీతాభవానీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఆత్రేయపురం, మార్చి 3: ర్యాలిలో మద్దుల వెంకటేశ్వరరావు రైస్ షాపులో ఎస్ఐ శ్రీనివాసరావు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలుచేసి అధిక ధరకు అమ్మకానికి నిల్వ చేసిన 743కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, మార్చి 3: వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన ఆకుల శ్రీనివాసచక్రవర్తి దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. వారికి చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఆదాయం రూ.3,89,985 వచ్చినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

సారా బట్టీపై దాడి

కపిలేశ్వరపురం, మార్చి 3: వీధివారిలంక లంకపొలాల్లో సారా బట్టీపై అంగర పోలీసులు ఆదివారం దాడి చేశారు. నామాడి శివరామకృష్ణను అరెస్టు చేసి, 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారాయి తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని, 200లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, కేసు నమోదు చేసినట్టు అంగర ఎస్ఐ ఎ.వరదేశి తెలిపారు.

నాలుగో తరగతి ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

రామచంద్రపురం, మార్చి 3: స్థానిక ముద్దాడ రవిచంద్ర భవనంలో ఆల్ ఆంధ్రప్రదేశ్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. రామచంద్రపురం డివిజన్ ఆల్ పోర్త్ క్లాస్ ఉద్యోగుల ఎన్నికలు ఎన్నికల అధికారి సవరపు చిన అప్పారావు అధ్యక్షతన జరిగాయి. అధ్యక్షుడిగా పడాల సత్యరామ ప్రసాద్, సహ అధ్యక్షుడిగా బేసి గోవిందరాజులు, ఉపాధ్యక్షుడిగా తోటకూర శ్రీనివాసరావు, గుమ్మడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా కొప్పిశెట్టి లోకేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా శీలం వెంకటరమణ, సింగపల్లి అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెలంపోతపు సత్తిబాబు, కోశాధికారిగా వి.రాంబాబు, గౌరవ అధ్యక్షుడిగా పలివెల త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు పితాని త్రినాథ్, విశిష్ట అతిథిగా ఎస్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.